# గౌరీ గిరుల గోరీలు

శ్రీపత్మి వీరభద్రరావు



గిరిబాబు ఎక్కువగా నారాక కెదురుచూస్తూ వుంటేవాడని నాకు తరువాత తెలిసింది. ఎందుకో క్రమంగా అవగాహన చేసుకోగలిగా. "నువ్వు ధన్యుడవు. దేశ స్వాతంత్ర్యంకోసం, అణగారిన పడి వున్న శ్రమజీవుల ఔన్నత్యంకోసం మానవ కల్పిత మతకులాగ్ని హోత్రములలో రక్తాన్ని హోమంచేసే పుణ్యాత్ముడవు. ధన్యుడవు.'' అని నేననే నిజ వాక్యాలు విని తన ఆనందానికి హద్దు తెలుసుకోలేక పోయేవాడు గిరిబాబు. అతణ్ణీ విధంగా ఎప్పుడూ చూడలేదు. ఏదో ఒక ప్రీత్యాత్మకమైన వస్తువును పారవేసుకున్నట్టు కనుపించాడు. వాని హృదయమంతా కలకలయిపోయిందని నాకు తోచింది. నా దగ్గరనుండి ఏదో కోరుతున్నట్టుగా ఊహించా... సాయం వాహ్యాలి అనే పేరుతూ చల్లగాలికి పాత చెరువుగట్టువైపుకు దారి పట్టాం, మాట్లాడుకుంటూ.

"అలా చూడు—నీకు ఆ కనుపించేదానిలో తెలిసిన మార్పేమిటి?'' అన్నాడు.

ఆ ప్రశ్నలో కొంత బాధ మిళితమై ఉందని తెలుసుకుని నాకేమీ తెలియలేదంటూ......

"ఆ గోరీ ఏమిటి గిరీ? పోయిన దెవరు'' అన్నాను. వాటి నోటంట మాటరాలేదు. నా దృష్టి ఇంకా గోరీ మీదనే ఉంది. వడిలిపోయిన గిరిబాబు మొహం చూడకుండానే.

"పోయిన వ్యక్తి ఎంత పుణ్యం చేసుకున్నాడో! గోరీ నిర్మించిన శిల్పి ఆ వ్యక్తి పవిత్రత కొనియాడుటకై జన్మించి ఉంటాడు—తెల్లగా ఎంత నిర్మల కాంతుల వెదజల్లుతూందో!'' అంటూ వాడి మొహం చూశాను. "ఆ ఎవరురా పోయినవ్యక్తి—అలా ఉన్నావేం—కారణం చెప్పవేం?'' అని అదుర్దాగా అడిగాను.

"గౌరి'' అన్నాడు దుఃఖపూరిత వదనంతో.

"గౌరి పోయిందా! కారణం ఏమిటి?'' అన్నాను గాయపడ్డ హృదయాన్ని తెలుసుకుని.

"నీకు తెలియనిదేముంది? ఆమె అగ్రవర్ణము లోనిది—నేను శూద్రుణ్ణి......'' అంటూ కళ్ళు తుడుచుకుంటున్నాడు.

"అయితే?'' అన్నాను అదుర్దాగా.

"మా కిరువురకూ చాలాకాలంనుంచీ పరిచయం. నేను వెళ్ళిన సమావేశాలన్నింటిలోనూ పాల్గొనేది ఉత్సాహంతో. నా దగ్గర అనేక విషయాలు నేర్చుకుంది. హిందీలో చక్కని ప్రవీణత సంపాదించింది. రాజకీయములన్నీ తెలుసు. నేను నలభైరెండు ఉద్యమంలో పాల్గొనేటప్పుడు, నిర్ణేతోద్యోగులు నన్ను పెట్టిన బాధలు చూసి ఏడ్చింది. ఆమెలో నాకొక ప్రత్యేకస్థానం ఉండేది. నాకు 'నా' అన్నవాళ్ళెవరూ లేకపోయినా అంతవరకూ ఈ వూళ్ళో నేను అందరికీ దైవతుల్యుణ్ణి''

"ఆ తరువాత మారిపోయిందా?'' అన్నాను.

"రెండు సంవత్సరాలకు జైలునుండి వచ్చాను. గౌరికి వయస్సు పెరుగు హెచ్చినకొద్దీ స్వేచ్ఛ తగ్గిపోతూ వచ్చింది. ఆడవాళ్ళూ మగవాళ్ళూకూడా వర్ణ విచక్షణ లేకుండా నా దగ్గర అనేక విషయాలు నేర్చుకొనేవారంతా. ఇంతలో సంఘ నిర్ణీతమైన వివాహ సమస్య నొకదానిని ఆమె ఎదుర్కొనవలసి వచ్చింది......''

“ఆ బాధ నీకేమి?” అన్నాను. అసలు విషయం తెలియక పోవటంచేత.

“చెప్పేది విను. తన్ను వివాహమాడమంటూ నాకో ఉత్తరం వ్రాసింది. మీ అందరికీ అంగీకారమైతే నాకూ సమ్మతమేనని తెలియపర్చా. అదే ఆధారంగా తీసుకుని నన్ను భర్తగా దృఢనిశ్చయం చేసుకుంది. వాళ్ళ కుటుంబంలో చిచ్చు పుట్టింది. అనేకవిధాల చెప్పారు—కొట్టారు—హింసించారు. వినలేదు. అదే కారణంగా బెంగతో మంచం పట్టింది. వారం తిరగకుండా లోకం మారిపోయింది.”

“అయ్యో! పాపం! ఇలా మన దురాచారాలు ఎంత మందిని బలి తీసుకుంటున్నాయో!” నిట్టూయస్తూ అన్నాను. ఇరువురమూ గోరీ దిక్కుగా నడుస్తున్నాము.

“ఊళ్ళో కొందరు గోరీ కట్టించారు...... పోయిన మనిషి ఏదో ఒక రూపంలో కనుపిస్తుందంటారు. నేను నమ్మేవాణ్ణి కాను. కాని ఒకరోజున నిద్రలో కనుపించి ‘నీ వొకసారి గోరీ దగ్గరకు రా, మాట్లాడాలి అంది”

“నువ్వు వెళ్ళావా?” అన్నాను.

“ఒక రోజున వెళ్ళాను. రాత్రి పన్నెండు గంటలకు ప్రపంచకమంతా నిర్మలంగా ఉంది. దేవతారూపంగా తోచింది. ఆమెలోగల ప్రత్యేకతను అప్పుడే ఎక్కువ తెలుసుకున్నాను.”

“ఏమి చెప్పింది?”

“నువ్వు నన్ను నమ్మలేదా పూర్తిగా అని అడిగింది. నీతో సరితూగుతూ త్యాగం చేయడానికి సంసిద్ధుణ్ణే నేను అన్నాను. అది వెన్నెలరాత్రి. చంద్రునితో సమానంగా ప్రకాశిస్తోందా గోరీ. ఆమె నిర్మల జీవితాన్ని గడుపుతూందని అనుకున్నా. నీవు చేయబోయేదేమిటి! అని ప్రశ్నిస్తే, ఆమెలో కొంత అశాంతి కూడా ఉందని తెలుసుకున్నా. నన్నేమి చెయ్యమన్నావని అడిగా. నీ ఇష్టంవచ్చినట్లు చెయ్యి. గౌరిని మాత్రం మరచిపోకు. నీకు ఎప్పుడూ కనుపిస్తూనే ఉంటా. ఈ గోరీలో నా శిలాప్రతిమను ముట్టుకుని కేక పెట్టు. నీతో వచ్చి మాట్లాడతా. నీ దగ్గరనుండి నేను కోరేదేమీ లేదు. నేనెవరిని నిందించను అని చెప్పింది” అంటూ చెప్పాడు.

ఆశ్చర్యం వేసింది నాకు. గోరీవద్దకు చేరుకున్నాం. గౌరి శిలా ప్రతిమకు ప్రాణం పోసినట్లుగా ఉంది. అదేదే కాకుండా అనేక చెక్కడపు పనులు చూపించాడు శిల్పి. ఆ ప్రతిమలో ప్రాణం ఉందో లేదో కాని శిల్పి చేతి ఉలిలో జీవం ఉందని తోచింది. కళయొక్క ఆవశ్యకతను తెలుసుకో గలిగాను. ‘కళ అనేది అనువాదము కాని సహజము కాదు. అనువాదమని తెలియకపోతే ఆనందము లేదు.’ అన్నారు కొమర్రాజు వారు. ముందు సహజమని భ్రమించినా మరుక్షణంలో అనువాదానందంలో మునిగిపోయా.

“నన్నేమి చెయ్యమన్నావు? నీ కలహాకోసం ఇన్నాళ్ళు ఏమీ చెయ్యకుండా ఉన్నాను. నీతో చెప్పుకోవడం నా మొదటి ఆశ. అది కాస్తా తీరిపోయింది... నాకు ‘నా’ అన్నవాళ్లు ఎవరూ లేరు. అంతా నాకు ప్రతికూలం. బ్రతికినా పోయినా మన మిద్దరం మరిచిపోకుండావుంటే అంతే చాలు.” ఆపులేకుండా చెప్పుతున్నాడు.

ఆలోచిస్తూ నేను—

“అయిపోయిందేదో అయిపోయింది. నువ్వు నాతోబాటు కలకత్తా వచ్చెయ్యి. ఇక్కడ ఇలా బెంగతోనే ఉంటావు. నీ కంటే గౌరి చాలా అదృష్టవంతురాలు......” అంటున్నాను.

“నేను కలకత్తా ఎందుకూ? నా అంత్యశ్వాసలుకూడా ఇక్కడనే విడవాలి. నీతో చెప్పకుంటే నాకు తృప్తిగా ఉంది. భూమిమీదనున్న

అనాథులలో నేనొకణ్ణి. నీకంటే ముందు నాకు పరలోకం ప్రాప్తిస్తే ఆ గోరీ సమీపంలో నాపేరు కూడా ఒక గోరీ వేయించు. అదే నిన్ను ఎక్కువగా కోరేది" అని బొటబొట కన్నీళ్లు కారుస్తున్నాడు.

"ఛీ! మతిపోయిందా గిరీ? ఆ మాత్రం దానికి ఆత్మను నీచపరచటం మంచిదికాదు" అన్నాను. వాణ్ణి బాధపెట్టే సమస్య ఏదో నాకు తెలుసు. కలకత్తా రానన్నాడు. ఇక నే విధంగా బాధ తప్పించగలను! చీకటి పడిపోయింది. తిరిగి బయలుదేరాం మాట్లాడుకుంటూ. ఊళ్లోకి వచ్చేశాం. వెళ్ళిపోతూ,

"నన్ను మరచిపోకు నే కోరినది మాత్రం తప్పకుండా చెయ్యి. వీలయితే కనుపిస్తా తరువాత" అన్నాడు. వాటికి సామాన్యార్థ ఇవ్వడం చేత నా కవగాహన కాలేదు. ఆ మాటల లోతుపాతులు—"రేపు ఉదయం కలుసుకుని మాట్లాడతా. నీవు మాత్రం అధైర్యపడకు. వెడుతున్నా" అని అక్కడ విడిపోయాం.

మొన్నాడు నే నింకా లేవలేదు. గిరిబాబు ఆత్మ చేసుకున్నాడంటూ లేపారు నన్ను ఎవరో. నాతో చెప్పకోవడంకోసం ఇంతకాలంనుంచీ సాహసించలేదు అని అంతర్య విషయాన్ని తెలుసుకున్నాను. నా పొరపాటుకై చింతించా.

గౌరితో చేరిపోయాడు. అందులో ఉంటే ఆనందం సామాన్య జీవితంలో కనుపించలేదతనికి. భరించలేని బాధ ఏదో ఉంటే నేకాని ఆత్మహత్యకు పూనుకోనడు వ్యక్తి. అత్యాచారమని తెలిసికూడా ఆత్మహత్యచేసుకున్నాడంటే పైకుబికిన దుఃఖ ఫలితం. క్రియలు సవ్యంగా జరిగిన తరువాత గౌరి గోరీ దగ్గరగా గిరి గోరీ కట్టించాం. గిరిబాబు మిత్రులందరమూ కలిసి, తెల్లరాతి విగ్రహం ఒకటి స్థాపించాం. 'వ్యక్తి, వస్తువు కనపించని సమయంలో చిత్రమూ, శిల్పమూ ఎక్కువగా ఉపయోగపడతాయి' అన్న టాగూరు వాక్యం అర్థంచేసుకున్నాను. ఆ వూరు వచ్చిన కొత్తవారు ఆ గోరీలు చూడకుండా వెళ్లరు ఎవరూ కూడా. గిరిబాబుకు అనుకూలంగా నేనేమి చెయ్యలేకపోయినప్పటికీ, నాకు తోచినప్పుడెల్లా కలకత్తానుండివచ్చి చూచి పోతూ వుంటా ఇప్పటికీ కూడా.

---

కాంతి సెకనుకు 1,86,000 మైళ్ళ వంతున ప్రయాణం చేస్తుంది.

• • •

ప్రపంచంలోని రైలు మార్గాలలో నూటికి 45 వంతున ప్రయివేటు కంపెనీల యాజమాన్యంలోనే వున్నాయి.

• • •

మలయాలో రబ్బరుతోటలు ఓం ప్రథమంగా 1875 లో నాట బడ్డాయి.


## పడతి చిరునగవులే పండుగలు!

**అవి నిత్యమూ మెరిసే గృహం స్వర్గతుల్యం**

నేటికాలంలో స్త్రీల సామాన్య రుగ్మతగా హిస్టీరియా ఏర్పడింది. దీనితో మహిళల ఆనందం స్వప్నావస్థగా మారింది. ఈ వ్యాధిని నిర్మూలించడంలోనే పడతి చిరునగవులు సంపాదించవచ్చు. మాచే తయారుచేయబడిన శాస్త్రోక్త ఔషధములు, ప్రత్యేక చికిత్సా విధానాలూ ఇంతవరకూ ఎన్నో గృహాలలో చిరునగవులను ఉదయింపచేసాయి. వెంటనే మా లేటలాగునకు వివరాలతో వ్రాయండి.

మధునాపంతుల కామరాజు,

ఆంధ్రాయుర్వేదాశ్రమము

పల్లిపాలెం, ఇంజరంపోస్టు తూ॥ గోదావరిజిల్లా.

బ్రాంచి:

సిటీప్రెస్ బిల్డింగ్స్, మెయిన్ రోడ్,

కాకినాడ.




# శ్రీమతి కమలాదేవి

*

శ్రీమతి ఎన్. కె. దేవి

ప్రముఖ కాంగ్రెస్ వాదిని. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యురాలు, అఖిల భారత మహిళా సభ అధ్యక్షురాలు, వక్త, కళాజీవి, నటి, సామ్యవాదినియైన శ్రీమతి కమలాదేవి ఛటోపాధ్యాయ జీవిత వాహినిలో రేగిన తుపానులను, వీచిన మృదు మందానిలాలను వివరించడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

—ఎడిటర్.

★

కమలాదేవి జననం 1903 లో. జన్మస్థానం మంగుళూరు. తండ్రి జిల్లా కలెక్టర్. తల్లి స్త్రీలకు సమాన హక్కులు, సమాన బాధ్యతలు వుండాలని వాదించే సంస్కర్తప్రియ. అమ్మమ్మ గీర్వాణభాషలో పండితురాలు.

బాల్యం ఈమెకు యించుమించుగా ఏకాంత వాసమే. ఉన్న అక్క వయస్సీమెకంటె యెనిమిది సంవత్సరాలు హెచ్చు. ఆమె వివాహిత. కాగా ఈమెకు ఒంటరిగా మసలడమే అలవాటయింది.

చిన్నప్పటినుంచే ఈమెకు పాఠశాలకు వెళ్ళి చదువుకోవడమంటే చిరాకు. నందనోద్యానవనం లాటితోటలలో తిరుగుతూ, శకుంతాల నిసర్గమనోహర గానంలో ప్రకృతి రమణీయకతలో--స్వాప్నిక జగత్తులో లీనమై తన్మయురాలు కావడం ఈమెకు ఇష్టం. తల్లి కిదికిట్టక పట్టుపట్టి పోరుపెట్టి స్కూలుకు పంపి చదివించేది.

సారస్వతంపట్ల ఈమెకు ఉత్సాహం కలగడానికి కారణం అమ్మమ్మే. ఆమెతో నిత్యం వేదాంతగోష్ఠి జరపడానికి అనేకులు వచ్చేవారు. ఆ సంభాషణలు—వేదాంతమర్మాలు తనకు పూర్తిగా బోధపడక పోయినప్పటికీ వాటిలో సముత్సాహంతో పాల్గొంటూ, వుండేది.

తనకు తల్లితోకంటె తండ్రితోనే ఎక్కువగా సాన్నిహిత్యం వుండేదని, తల్లికంటే తండ్రే తన ప్రకృతిని యెక్కువగా అర్థం చేసుకొన్నాడని ఈమె ఒక పత్రికా విలేఖరితో జరిగిన ఇంటర్వ్యూలో అన్నది.

1910 లో కమలాదేవి తండ్రి పరమపదించాడు. ఆయన మరణశాసనం ఏమీ వ్రాయకుండానే కాలధర్మం చెందడంవల్ల ఆస్తియంతా సవతి అన్నకు చెందింది. అతను కమలాదేవి తల్లికి మనోవర్తి ఇస్తానన్నాడు. కాని అభిజాత్యంగల దగుటచే ఆమె అందుకు తిరస్కరించింది, అప్పుడు అతడు ఆస్తిలో కొంతభాగాన్ని ఆమె యావజ్జీవ పర్యంతం అనుభవించడానికి ఏర్పాటుచేశాడు.

ఏమైనా అంతవరకు మహాఠీవితో హోదాతో భోగభాగ్యాలతో తులతూగిన ఆ కుటుంబం ఖర్చు తగ్గించుకోవలసిన వచ్చింది. కుటుంబ బాధ్యత కమలాదేవి గ్రహించింది. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడంలోని అనర్థాన్ని గ్రహించింది.

తాను ఊహించుకొన్నట్లు ప్రపంచం సుఖమయంకాదని ఈమె తెలుసుకొని శ్రద్ధాసక్తులతో విద్యావ్యాసంగానికి పూనుకుంది.